క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

సదుం: మండలంలో బుధవారం బైక్ అదపు తప్పి యువకుడు గాయపడ్డాడు. చింతపర్తివారిపల్లెకు చెందిన సంతోష్ బైక్‌పై సదుం బయలు దేరాడు. సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద బైక్ అదుపుతప్పి వంతెన గోడను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108లో పీలేరుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

ఆడ పిల్లలకు మనోధైర్యమే ఆయుధం



వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న సీఐ సోమశేఖర్‌రెడ్డి, దాత పవన్

వి.కోట: ఆడపిల్లలకు మనోధైర్యమే ఆయుధమని, ఎలాంటి కష్టాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలని సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక బీసీ బాలికల వసతి గృహానికి గురువారం కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ ప్రతినిధులు వాటర్ ఫిల్టర్ వితరణ చేశారు. కళ్యాణ్ ఫౌండేషన్ అధినేత పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ ఫౌండేషన్ వి.కోట శాఖ అధ్యక్షుడు ఇమ్రాన్ జన్మదినాన్ని పురస్కరించుకుని హాస్టల్ విద్యార్థులకు వాటర్ ఫిల్టర్ అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మనోజ్‌కుమార్, పవన్, దినేష్, జయంత్, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్ అమర్‌నాథ్

రొంపిచెర్ల: మండలానికి 8366 బియ్యం కార్డులు వచ్చినట్టు తహసీల్దార్ అమరనాథ్ తెలిపారు. ఆయన గురువారం రేషన్ డీలర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి లబ్ధిదారులకు బియ్యం కార్డులు అందజేయాలన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బియ్యం కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త కార్డు వస్తుందన్నారు. డీటీ కిరణ్ కుమార్, వీఆర్వోలు పల్లవి, దామోదర్, సురేంద్ర, కార్యదర్శులు హరిబాబు, శివకుమార్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

సదుం: భూవివాదంపై ఇరువర్గాల వారు బుధవారం ఘర్షణపడి గాయపడ్డారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ షేక్ షావలి తెలిపారు. మొరవపల్లెకు చెందిన సోదరులైన నరసింహులు, ఎర్రయ్యకు 4.5 ఎకరాల వ్యవసాయ పొలం వుంది. దీని పంపకాలపై ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఘర్షణ పడటంతో నరసింహులు భార్య చంద్రమ్మ, ఎర్రయ్య గాయపడ్డారు. వారి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

కింద ఇసుక.. పైన వరిగడ్డి

తమిళనాడు, కర్ణాటకలో ఇసుకకు డిమాండ్ ఎక్కువగా వుంది. అక్కడ లారీ ఇసుక రూ.లక్షలు పలుకుతోంది. దీంతో ఆంధ్రాలోని సరిహద్దుల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. అధికారులకు ఎక్కడా అనుమానం రాకుండా అక్రమార్కులు చర్యలు తీసుకుంటున్నారు. పుష్ప సినిమాలో ఎర్రచందనం దుంగలను తరలించినట్టు లారీ బాడీ చుట్టూ వరిగడ్డి చుట్టలను పెట్టి మధ్యంలో ఇసుక నింపి పైన వరిగడ్డిని పరుస్తున్నారు. అధికారులు తనిఖీ చేసినా వరిగడ్డి అని వదిలేస్తున్నారు. తాజాగా చిత్తూరు మీదుగా చెన్నైకి ఇసుకను టార్పాలిన్ కప్పి తరలిస్తున్న విషయం పత్రికల్లో రావడంతో వరిగడ్డి మాటున ఇసుక వెళుతోందన్న మాటను కర్ణాటకలోని నంగళి ఇసుక స్మగ్లర్లు లీక్ చేశారు.



పలమనేరు మీదుగా వెళుతున్న వరిగడ్డి లారీ(ఫైల్)

- యథేచ్ఛగా కర్ణాటకకు ఇసుక తరలింపు
- హొస్‌కోటకు చేరితే లారీ ఇసుక రూ.1.20 లక్షలు
- విషయం తెలిసినా పట్టించుకోని అధికారులు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని కౌండిన్య నదితోపాటు చెరువులు, నదులు, వాగుల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కౌండిన్య నదిలోని నీటిలో మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకను టిప్పర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి రాత్రిళ్లు ఇతర ప్రాంతాలకు పంపుతున్నారు. ఈ విషయంపై పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు కొంతమేర తనిఖీలు చేపడుతున్నారు. భారీ టన్నేజి లారీల్లో ఇసుక వేశాక దారిలో ఇసుక రాలడం సహజం. లారీలో ఇసుక ఉన్నట్టు అధికారులు గుర్తించి సీజ్ చేసే అవకాశం వుంటుంది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు తమ తెలివిని ప్రదర్శిస్తున్నారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా వరిగడ్డిని కట్టలు కట్టి వాటిని లారీ బాడికి చుట్టూ అమర్చుకుని క్యాబిన్ దాకా ఇసుక నింపి ఆపై మళ్లీ పైదాకా వరిగడ్డి కట్టలతో నింపుతున్నారు. ఈ లారీలు చిత్తూరు, పలమనేరు దాటి కర్ణాటకలోని ముళబాగిలు, కోలార్ బైపాస్ మీదుగా ఎలాంటి ఇబ్బంది లేకుండా హొస్‌కోటకు చేరుతున్నట్టు సమాచారం. అసలు ఇసుకను ఇలా కూడా తరలిస్తారనే విషయం మైనింగ్, పోలీసు శాఖలకు సైతం తెలియని పరిస్థితి.

హొస్‌కోటలో లోడు ఇసుక రూ.1.20 లక్షలు

సాధారణంగా ట్రాక్టర్‌కు నాలుగు టన్నుల ఇసుక నింపుతారు. దాని ధర స్థానికంగా రూ.2,200లు. టెన్ వీలర్ లారీకి ఏడు ట్రాక్టర్ల ఇసుక అంటే 28 టన్నుల ఇసుకను నింపుతారు. దీని ధర గూడూరు, జీడీ నెల్లూరు ప్రాంతాల్లో రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. కర్ణాటకలోని హొస్‌కోటలో రూ.1.20 లక్షలు ఉంది. ఆ లెక్కన లోడుకు ఖర్చు రూ.40 వేలు పోయినా రూ.60 వేలు మిగిలినట్టే. ఇలా రోజుకు నాలుగు లోడ్లు తోలితే రూ.2.40 లక్షలు మిగులుతుంది.

సరిహద్దులో చెక్‌పోస్ట్ ఉండాలి

పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద గతంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఉండేది. ఇక్కడ అన్ని వాహనాలను తనిఖీ చేసేవారు. ఎర్రచందనం, కందిపప్పు, రెక్టిఫైడ్ స్పిరిట్, నిషేధిత గుట్కాలు, ఇసుక లారీలు, తదితరాలను పట్టుకునే వారు. దీన్ని సెంట్రల్ పాలసీ పేరిట తీసేశారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య తనిఖీలు కొండెక్కాయి. సెస్ బిల్లులన్నీ ఆన్‌లైన్ కావడంతో ఏ వాహనంలో ఏముందో అడిగే దిక్కే లేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణాపై ఇక్కడి మైనింగ్ అధికారులను అడుగుదామని ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయొద్దని నిరసన

పలమనేరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. 2000 ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకున్నారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు తలొగ్గి స్మార్ట్ మీటర్ల పేరిట ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరిట పేదల రక్తాన్ని తాగుతున్నాయని దుయ్యబట్టారు. గతంలో స్మార్ట్ మీటర్లు వద్దన్న చంద్రబాబు ఇప్పుడు అవే ముద్దంటున్నారని విమర్శించారు. నాయకులు మంజునాథ, ధనమ్మ, గిరిధర్‌గుప్త, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు: మండలంలోని సుగాలిమిట్ట వద్ద గురువారం బైక్‌లో వెళ్తున్న ఇద్దరు బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పలమనేరు మండలం కొలమాసనపల్లెకి చెందిన చంద్రశేఖర్(30), కన్నప్ప(28) బైక్‌లో మదనపల్లెకు వెళుతున్నారు. సుగాలిమిట్ట వద్ద బస్సును ఓవర్‌టేక్ చేయబోయారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన కారును ఢీకొన్నారు. ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో పుంగనూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- పారిశుధ్య పనుల్లో వెనుకబడి ఉన్నామని ఆవేదన
- బ్యాటీ చెత్తబండ్లను వాడుకలోకి తీసుకురావాలి
- హంద్రీ–నీవా నీటిని వైఎస్సార్ జలాశయానికి మళ్లించాలి



మున్సిపల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు: పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా వున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ సమావేశపు హాలులో గురువారం చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ కోదండరామయ్య మాట్లాడుతూ పలమనేరులో చెత్తను తరలించేందుకు ప్రతిచోటా బ్యాటరీ బండ్లను వాడుతున్నారని, అధికారులు తమిళనాడులోని గుడియాత్తం మున్సిపాలిటీని పరిశీలిస్తే బాగుంటుందని సూచించారు. కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ ఇళ్ల వద్ద బోర్లు వేసుకునేందుకు తాము చెప్పినా అధికారులు పట్టించుకోకుండా నేరుగా బోరు వేసేవారితో మాట్లాడుకుని బోర్లు వేయిస్తున్నారని, దీని వెనుక ఏ రహస్యాలు నడుస్తున్నాయో చెప్పాలని నిలదీశారు. దీనిపై విచారిస్తామని కమిషనర్ సమాధానమిచ్చారు. స్థానిక రాధాబంగ్లాలో లోటఓల్టేజీ సమస్యపై చర్యలు తీసుకోవాలని గత సమావేశాల్లో చెప్పినా ఫలితం లేదని ఆ వార్డు కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు దోమలు ఎక్కువై జ్వరాలు ప్రబలుతున్నాయని, పట్టణంలో ఫాగింగ్ చేయాలని కౌన్సిలర్ కిరణ్ సూచించారు. హంద్రీ–నీవా నీటిని కౌండిన్య మీదుగా కాలువపల్లి వైఎస్సార్ జలాశయానికి మళ్లిస్తే పట్టణంలో తాగునీటి సమస్య ఉండదని గొబ్బిళ్లకోటూరు కౌన్సిలర్ శారద అధికారులకు సూచించారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలి



జ్ఞాపిక, ప్రశంసాపత్రాలందుకున్న పిల్లలతో నిర్వాహకులు

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసి తెలుగుభాష రక్షణకు నడుం బిగించాలని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక కళామందిరంలో గురువారం మందుస్తుగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు మాధ్యమంలో ఉన్నత విద్య చదివి వారికి ప్రభుత్వ కొలువుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పిల్లలు నీతి పద్యాలను నేర్చుకోవడం ద్వారా ధారణశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో తెలుగు భాషపై నిర్వహించిన వ్యాసరచన, నీతిపద్యాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, పుస్తకాలు అందజేశారు. ఇందులో గంగవరం ఎంఈవో వేణుగోపాల్, సంస్థ కార్యదర్శి పుష్ప, పలువురు కవులు, రచయితలు, తెలుగుభాషాభిమానులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు 11 కేవీ విద్యుత్ లైనుకు మరమ్మతులు



చెరువు కట్టపై వాలిన స్తంభానికి మరమ్మతులు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె: మండలంలోని కొండయ్యగారిపల్లె–ఎస్ అగ్రహారం వెళ్లే రోడ్డులోని పెద్దచెరువు కట్టపై ప్రమాదకరంగా వున్న 11 కేవీ విద్యుత్ స్తంభాలను ఎట్టకేలకు మార్చారు. ఇక్కడ విద్యుత్ స్తంభాలు ఒక వైపునకు వాలిపోయి ప్రమాదకరంగా వున్నాయి. సాక్షి దినపత్రికలో అక్కడ అలా.. ఇక్కడ ఇలా అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ స్తంభానికి మరమ్మతులు చేయించారు. లైనుకు అడ్డంగా ఉన్న చెట్లు, కొమ్మలను తొలగించారు.

తెలుగుభాషకు గిడుగు సేవలు ఘనం



గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పలమనేరు: తెలుగుభాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలు ఘనమైనవని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. స్థానిక కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో గురువారం ముందస్తుగా తెలుగు భాషాదినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గిడుకు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మాతృభాషలో పట్టున్నవారు ఇతర భాషల్లోనూ రాణిస్తారని తెలిపారు. కొన్నేళ్లుగా విద్యార్థులు తెలుగుభాషను నిర్లక్ష్యం చేస్తూ ఆంగ్లంపై మోజు పెంచుకుంటున్నారని తెలిపారు. తెలుగు విభాగాధిపతి వాసు మాట్లాడుతూ గ్రాంథిక భాషగా వున్న తెలుగు బోధనను సులభతరం చేసి సామాన్యులకు సైతం అర్థమయ్యేలా చేసిన ఘనత గిడుగు రామ్మూర్తి పంతులుకు దక్కుతుందన్నారు. అనంతరం తెలుగు సబ్జెక్ట్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, అధ్యాపకులు నందీశ్వరయ్య, సుబ్బానాయుడు, షేక్ బేనజీర్, కిరణ్, రాజేష్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ఇంటింటికీ తీసుకెళ్దాం



మాట్లాడుతున్న బాలాజీనాయుడు

పలమనేరు: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్ సీపీ పలమనేరు మండల కన్వీనర్ బాలాజీనాయుడు పిలుపునిచ్చారు. ఆయన గురువారం పలమనేరులో కొలమాసనపల్లి పంచాయతీ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కోఆర్డినేటర్ వెంకటేగౌడ ఆధ్వర్యంలో మండలంలోని కొలమాసనపల్లిలో వచ్చే సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు విధిగా ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు కూటమి మోసాలని వివరించాలని కోరారు. కొలమాసనపల్లి పంచాయతీ–1 అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, కొలమాసనపల్లి–2 అధ్యక్షుడు సంతోష్‌కుమార్, నాయకులు రంగన్న, విశ్వనాథ రెడ్డి, సర్పంచ్ గోవిందుసామి, ఎంపీటీసీ శ్రీనివాసులు, చెంగారెడ్డి, అమరనాథ రెడ్డి, మనోజ్ రెడ్డి, మునిరత్నం, వీరభద్ర పాల్గొన్నారు.

ఇద్దరు కోడి పందెంరాయుళ్ల అరెస్టు

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లె సమీపంలోని మురుకుగుంట వద్ద కోడి పందెం ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఈ క్రమంలో కోడి పందెం ఆడుతున్న రామ్మూర్తి, ఆనంద్‌ను అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు

- వాడవాడలా వెలసిన బొజ్జ గణపయ్యలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- పలుచోట్ల భక్తులకు అన్నదానం



పలమనేరు: అంకిశెట్టి వీధిలో వద్ద ఊయలలో ఊగుతున్న వినాయకుడు



పుంగనూరు: ఎస్ఎస్.పేటలో ఏర్పాటు చేసిన పంచముఖ వినాయకుడు

పలమనేరు/పులిచెర్ల (కల్లూరు)/పెద్దపంజాణి/చౌడేపల్లె/సదుం/గంగవరం/కుప్పం/వి.కోట/గుడుపల్లె/బైరెడ్డిపల్లె/రొంపిచెర్ల/పుంగనూరు: పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో బుధవారం వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఇళ్లలో కూడా మట్టి ప్రతిమలను పెట్టి పూజలు చేశారు.

- పలమనేరు పట్టణంలోని అంకిశెట్టి వీధిలో గణపయ్యను గురుత్మంతుడు ఊయలలో ఉంచి ఊపుతున్నట్టు ఏర్పాటు చేసిన సెట్టింగ్స్ విశేషంగా ఆకట్టుకుంటోంది. రంగాపురం, మార్కెట్ కమిటీల వద్ద భారీ వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. రంగబాబు సర్కిల్ ఎద్దులసంత వీధి, శ్రీనగర్ కాలనీ, రాధా బంగ్లా, కొత్తపేట, గుడియాత్తం రోడ్డు, మదనపల్లి రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రకరకాల విగ్రహాలు ఆకట్టుకున్నాయి.
- పులిచెర్ల మండలంలోని కల్లూరు, పులిచెర్ల, మంగళంపేట, కొమ్మిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లో వినాయకుని పెద్ద పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేశారు.
- పెద్దపంజాణి మండలం రాయలపేట బసవన్నకట్టలో కొలువైన గణనాథుడు ఆకట్టుకున్నాడు. మహిళలు పుట్టలో నాగపడగలు, పాలు, కోడి గుడ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు.



చౌడేపల్లె టీచర్స్‌కాలనీలో కొలువైన వినాయకుడు

- చౌడేపల్లెలోని టీచర్స్‌కాలనీ, కేటీస్ట్రీట్, నేతాజీనగర్, హైస్కూల్ వీధి, గాంధీవిధి, బస్టాండు కూడలి, గోసులకురప్పల్లె, బత్తలాపురం రోడ్డు, పలమనేరు రోడ్డు, నాయుడు కాంప్లెక్స్, భజంత్రికాలనీ, నడివీధి గంగమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లోనూ వేర్వేరు ఆకారాల్లో ఉన్న వినాయకుడి విగ్రహాలను నెలకొల్పారు. యువత పాటలు, డ్యాన్స్‌లతో హంగామా చేశారు.
- సదుం మండలంలో మహిళలు వినాయకుడితోపాటు నాగరాళ్లకు పూజలు చేశారు. మండపాల వద్ద యువకుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- గంగవరం మండలంలో వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- కుప్పం పట్టణంతోపాటు మండలంలో వినాయక చవితిని ఘనంగా జరుపుకున్నారు. ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్, రైల్వే స్టేషన్, పాతపేట, హెచ్‌పీ రోడ్డు ప్రాంతాల్లో వినాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేశారు. గుత్తార్లపల్లి వరసిద్ధి వినాయకస్వామి, కొత్తపేట వినాయక స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.
- వి.కోట మండలంలో వాడవాడలా వినాయక చవితి పండుగ సంబరాలు మిన్నంటాయి. వికోటలోని పోలీసు స్టేషన్‌వీధి, స్కూల్ వీధి, కన్యకా పరమేశ్వరి వీధి, కట్టపైన, భారత్‌నగర్, మార్కెట్ యార్డు, దాసార్లపల్లి, టెంపో స్టాండ్‌లో వినాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.
- గుడుపల్లె మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం రాత్రి వినాయక విగ్రహాల వద్ద యువకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.
- బైరెడ్డిపల్లె: మండలంలో వినాయక చవితి వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.
- రొంపిచెర్ల మండలంలోని బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల, చెంచెంరెడ్డిగారిపల్లె, బండకిందపల్లె, పెద్దమల్లెల, మోటుమల్లెల, గానుగచింత, పాతకురవపల్లె, చల్లంపల్లె గ్రామాల్లో వినాయక చవితిని ఘనంగా జరుపుకున్నారు. వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.
- పుంగనూరు పట్టణం, మండలంలో వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎస్ఎస్.పేటలో 22 అడుగుల భారీ పంచముఖి గణపతిని ఏర్పాటు చేశారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పలమనేరు: రంగాపురంలో భారీ బొజ్జ గణపయ్య

3న మండల సమావేశం

పుంగనూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సెప్టెంబర్ 3న ఎంపీపీ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

రొంపిచెర్లకు చేరిన 600 బస్తాల జిప్సం



బొమ్మయ్యగారిపల్లె ఆర్బీకేకు వచ్చిన జిప్సం

రొంపిచెర్ల: మండలానికి 600 బస్తాల జిప్సం వచ్చినట్టు ఏవో శ్రావణి తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ బస్తా రూ.175.50 రైతులకు అందజేస్తామని తెలిపారు. జిప్సంను మామిడి, వేరుశనగ పంటకు వేసుకోవచ్చని, తద్వారా పంట దిగుబడి బాగా వుంటుందన్నారు. రైతులకు ఎకరాకు నాలుగు బస్తాల వంతున ఇస్తామని తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో సోమవారం నుంచి పంపిణీ చేస్తామని తెలిపారు.

పేదలకు అన్నదానం



పుంగనూరు: వినాయక చవితి పండుగ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా గురువారం కొత్తపేటలో పేదలకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు ప్రతి ఏటా వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం చేయడం ఆనవాయితీ. కార్యక్రమంలో వినాయక కమిటీ నిర్వాహకులు మహేష్, చిన్న, సూరి, వెంకట్, భాస్కర్, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.